ప్రజాశక్తి

సోమవారం 20 జనవరి 2025

నేటి నుంచి ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా వ్యాప్తంగా జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమం, సర్వే ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి రెండో తేది వరకు చేపడుతున్నట్లు జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి వినోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశా కార్యకర్త, ఒక వాలంటీర్‌తోపాటు ప్రతీ ఇంటికి వచ్చి తనిఖీ చేసి, లక్షణాలు ఉన్నవారికి వైద్యాధికారి పరీక్షించి చికిత్స అందిస్తారని వివరించారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు ప్రారంభిస్తారని చెప్పారు.

అమిత్‌షా పర్యటనపై
భగ్గుమన్న వామపక్షాలు

పాచిపెంట.. నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రెడ్డి వేణు

ప్రజాశక్తి-పార్వతీపురం

రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్‌ని అవమానపరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనపై వామపక్షాలు భగ్గుమన్నాయి. అమిత్‌షా పర్యటనకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ఆదివారం పార్వతీపురం పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీనికి ముందు ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.వి రమణ అధ్యక్షతన జరిగిన సభలో వామపక్ష నాయకులు మాట్లాడుతూ దేశ అత్యున్నత పార్లమెంట్‌లోనే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కి అవమానం జరిగిందన్నారు. అంతటి అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిజెపికి రాజ్యాంగం పట్ల, రాజ్యాంగ నిర్మాత పట్ల ఎలాంటి గౌరవమూ లేదన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం తమ విధానాలను అవలంబిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధంగా రైతులు, ప్రజలు, ప్రజా సంఘాలు, వామపక్ష శ్రేణులపై కేంద్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని విమర్శించారు. బిజెపి అవలంబిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపై ప్రజలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ, పి.రాజశేఖర్, బి.సూరిబాబు, పాకల సన్యాసిరావు, సిపిఐ నాయకులు టి.జీవ, సిపిఐ (ఎంఎల్) నాయకులు పి.రమణి, బి.నరసింగరావు, భాస్కరరావు, పి.సంఘం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, విద్యార్థి సంఘ నాయకులు డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : రాష్ట్రంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటనకు

జిల్లాలో పలుచోట్ల నిరసనలు

వ్యతిరేకంగా పాచిపెంటలో కాంప్లెక్స్ జంక్షన్‌లో గాంధీ బొమ్మ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రెడ్డి వేణు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్‌పై అవమానకరమైన, అప్రతిష్టాత్మకమైన వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్‌చేశారు. రాజ్యాంగం పట్ల, ప్రజల పట్ల బిజెపి నేతలకు ఏమాత్రమూ గౌరవం లేదన్నారు. అమిత్ షా దుర్మార్గమైన వైఖరిని ప్రజలంతా ఎండగట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు, మండల నాయకులు కోడికాళ్ల త్రినాథ, సుర్రు రామారావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పిన్నింటి రమేష్, కె.రాజు, రైతు సంఘం నాయకులు బూర వెంకన్న, హమాలీ నాయకులు కలిశెట్టి తవుడు, నారాయణరావు, గిరిజన సంఘం నాయకులు కొట్టిస రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : కేంద్ర హోంమంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనకు వ్యతిరేకంగా సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన కొమరాడలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు లక్ష్మయ్య, రైతు సంఘం నాయకులు లక్ష్మునాయుడు, శివునినాయుడు, పకీర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు ; కొమరాడలో నిరసన తెలుపుతున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

పెద్దపండగ వెళ్లిపోయింది...
పల్లె బోసిపోయింది

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

బోసిపోయిన ఇళ్ల ముంగిళ్లు

సంక్రాంతి పండగ సందర్భంగా గత వారం రోజులుగా కళకళలాడిన పల్లెలన్నీ బోసిపోయాయి. నిన్నటి వరకూ ఇళ్లన్నీ పక్షులతో నిండిన చెట్లలా కిక్కిరిసిపోయాయి. ఎక్కడ చూసినా 'అక్కా బాగున్నావా? అల్లుడూ ఎప్పుడొచ్చావ్? ఎలాగున్నారు?' అంటూ ఆత్మీయ పలకరింపులే కనిపించాయి. ఏ నలుగురు కలిసినా ఆ రోజుల్లో ఎలా జరిగిందో.. అంటూ పాతకాలం నాటి కబుర్లతో ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లి, జ్ఞాపకాల నెమరువేసుకునే వారు. ఇక యువతరం అయితే, 'ఏం రా మామా... హాయ్ బ్రో!' అంటూ పలకరింపుల సందడే.

ఇక అమ్మాయిల సందడే వేరు. కొత్తబట్టల ఫ్యాషన్ షోలు, బ్యూటీపార్లర్ ముచ్చట్లు, భోజనానికి రండంటూ తాతా, అమ్మమ్మల పిలుపులు, కొత్త అల్లుళ్ల అలకలు ఆనందం అంతా పల్లెటూర్లలోనే ఉందా? అనిపించేంతగా పండగ సందడి కనిపించింది. అయితే సంక్రాంతి అయిపోయింది... అందరి సెలవులూ ముగిసి పోయాయి. గంగిరెద్దుల సన్నాయి పాటలు లేవు. హరిదాసుల కీర్తనలు లేవు. కోడిపందేల కోలాహలం లేదు. చిన్నపిల్లల పరుగుబాటలు లేవు. యువతీ యువకుల కేరింతలు లేవు.. ఆదరాబాదరాగా బ్యాగులు సర్దుకుంటూ పల్లె జనాలంతా పట్టణాలకు పరుగులు తీయడంతో గ్రామాలు బోసిపోతున్నాయి. ఏడాదికి ఒకసారి వచ్చే వలస పక్షుల్లా కూలీలు ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం మళ్లీ పయనమయ్యారు. దీంతో జిల్లాలోని పలు గ్రామాల్లో నిశ్శబ్దం వాతావరణం అలముకుంది.

పిల్లాపాపలతో సందెపొద్దు సూరీడులా వెలిగిపోయిన గ్రామాల్లో మలిపొద్దు సాయంకాలంగా మారిపోయాయి. నిన్నటి వరకూ తనతో గడిపిన మనుమలు, మనుమలు, కూతురు, కొడుకు అల్లుళ్లు, కోడళ్లు ఒక్కసారిగా కనిపించక పోయేసరికి వీధిగుమ్మం వద్ద పెద్దల ఎదురు చూపులే మిగిలాయి. వచ్చే ఏడాది పండుగ కోసం తుమ్మచెట్ల మధ్య చందమామలా ఆశగా ఎదురుచూస్తున్నారు.

తిరుగు ముఖం పట్టిన గంగిరెద్దు

అంగన్వాడీ హెల్పర్ల నియామకానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయకుల పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి టి.కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పాలకొండ డివిజన్‌లో సీతంపేట ప్రాజెక్టు పరిధిలో రెండు, భామిని ప్రాజెక్టు పరిధిలో ఒకటి, కురుపాం ప్రాజెక్టు పరిధిలో ఆరు., పార్వతీపురం డివిజన్‌లో పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలో ఒకటి, సాలూరు ప్రాజెక్టు పరిధిలో ఒకటి అంగన్వాడి సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. వాటి భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు. పార్వతీపురం, సాలూరు, కురుపాం, సీతంపేట, భామిని ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో ఏర్పడిన 11 అంగన్వాడీ సహాయకుల పోస్టుల ఖాళీలను షెడ్యూల్ ట్రైబల్ హేబిటేషన్ గ్రామాలను అనుసరించి ఎస్‌టి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

స్థానికులైన వివాహిత మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 27వ తేది సాయంత్రం 5 గంటలలోపు సంబందిత ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. 2024 జులై ఒకటో తేదీకి 21 నుండి 35 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, వారు లేకుంటే దాని కన్నా తక్కువ విద్యార్హత కలిగిన వారిని పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు.

వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

20 నుంచి పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో పశు వైద్య శిబిరాలను ఈ నెల 20 నుంచి 31వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్‌ను విడుదల చేసారు. రాష్ట్రంలో పశు పోషకులకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, నిధులు కేటాయిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందిస్తోందని ఆయన చెప్పారు. ఈ క్రమంలో పశువుల ఆరోగ్యానికి, ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి, పశుపోషణ ఖర్చులు తగ్గించడానికి, రైతుకు ఆర్థిక అండను కల్పించడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు. పశుసంవర్ధక సేవలను పశుపోషకులకు మరింత చేరువ చేయడానికి అన్ని గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వెటర్నరీ డిస్పెన్సరీ, వెటర్నరీ ఆసుపత్రి పరిధిలో అన్ని మండలాలలో ఎంపిక చేసిన గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరాలను ప్రతి రైతూ ఉపయోగించుకోవాలని కోరారు.

జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు మాట్లాడుతూ పశు వైద్య శిబిరాలలో పశువైద్యులు పరీక్షించి ఉచితంగా వైద్యం అందిస్తారన్నారు. తేలికపాటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 23,940 గోకులాల యూనిట్లు మంజూరు చేయగా, 22,337 గోకులాల యూనిట్ల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-సీతంపేట

అడలి రోడ్డు మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకొంటామని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని అడలి వ్యూ పాయింట్‌ను, మార్గం మధ్యలో ఉన్న మలుపులను పరిశీలించారు. ఇటీవల ప్రమాదం జరిగిన మలుపును పరిశీలించారు. జెఎసి నాయకులు బి.శ్రీనివాసరావుతో జరిగిన ప్రమాదాల గురించి మాట్లాడారు. మలుపుల వద్ద రక్షణ గోడలు, రోడ్డు విస్తరణ కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని సూచించారు. దీంతో పాటు జలుబుగూడ గ్రామానికి కూడా రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ నాగభూషణ్ పాల్గొన్నారు.

ప్రమాదం గురించి ఆరాతీస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్

20 ఏళ్లుగా చిన్నచూపే?

ఏజెన్సీ జీవగెడ్డలపై పాలకుల నిర్లక్ష్యం ● అభివృద్ధికి నోచని సాగునీటి వనరులు

ప్రతిపాదనలకే పరిమితమైన సీమలగూడ మినీ రిజర్వాయర్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో పంటలు పండించాలంటే గిరిజన రైతులకు వర్షాలే ఆధారం. పుష్కలమైన సాగునీటి వనరులు ఉన్నా, వాటిని అభివృద్ధిలోకి తీసుకురావడంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా సాగునీరు అందని దుస్థితి నెలకొంది. దీంతో గత కొన్నేళ్లుగా కరువుఛాయలతో గిరిజన రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సకాలంలో వర్షాలు కురిస్తే రైతుల పంట పండినట్టే, లేదంటే కరువు తప్పదు. అలా తయారైంది ఏజెన్సీలోని గిరిజన రైతుల పరిస్థితి.

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని ఏజెన్సీ ప్రాంతంలో దశాబ్దాలుగా జీవగెడ్డలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఏళ్ల తరబడి అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్, టిడిపి, వైసిపి ప్రభుత్వాలు వీటిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికల వాగ్దానాల్లో చిన్న తరహా సాగునీటి వనరుల అభివృద్ధి కోసం హామీలిచ్చిన నేతలు తీరా అధికారం చేపట్టాక నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఏజెన్సీలో సాగునీరు లేకుండా పోయింది. ఫలితంగా పంటలకు సాగునీరు అందక కరువు ఏర్పడి బీడు భూములుగా మారుతున్నాయి. మన్య ప్రాంతంలో కొండల్లో అనేక జీవ గెడ్డలు ప్రవహిస్తున్నాయి. వీటిపై చిన్నచిన్న ప్రాజెక్టులు నిర్మిస్తే వేలాది ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందే అవకాశం ఉంది.

దశాబ్దాలుగా నిర్లక్ష్యం

గిరిజనులు, రైతుల పట్ల పాలకుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా గత 20 ఏళ్లుగా సాగునీటి వనరులపై చిన్నచూపు కనిపిస్తోంది. కొత్త వాటిని నిర్మించడం లేదు సరి కదా? ఉన్నవాటివైనా అభివృద్ధి చేసే ఆలోచన లేకపోవడం గిరిజన రైతులకు శాపంగా మారింది. ఎన్నికల సమయాల్లో, బహిరంగ సమావేశాలకు ఆయా ప్రాంతాలకు వచ్చిన సందర్భాల్లో ప్రతిపాదనల హామీలే తప్ప పనులు చేపట్టకపోవడంతో అభివృద్ధి జాడ కానరాలేదు. దీంతో పంట పొలాలకు సాగునీరు అందక గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది వర్షాధారంపైనే ఆధారపడి పంటలు వేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. సకాలంలో వర్షాలు లేకుంటే ఆ ఏడాది కరువే.

నిర్వహణ చేపట్టని కొత్తగూడ చెక్‌డ్యామ్

ప్రతిపాదనలతో సరి.

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలోని సీమలగూడ మినీరిజర్వాయర్ అభివృద్ధి కోసం రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు మూడు సార్లు ప్రతిపాదనలు చేసినా పనులు చేయలేదు. ఈ రిజర్వాయర్ అభివృద్ధిలోకి తీసుకువస్తే సమీపంలోని కేదారిపురం, కేదారిపురం కాలనీ, కుంభయ్య గూడ, సీమలగూడ తదితర పది గ్రామాల్లో 1500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. గంఁద్ర సమీపంలో ఉన్న చెక్‌డ్యామ్ కూడా మరమ్మతులకు గురైంది. దీన్ని అభివృద్ధి చేస్తే సమీపంలోని 1500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. కురుపాం మండలం గుమ్మిడిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం చేపడితే 15 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. రూ.5 కోట్ల ఖర్చుతో కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లిలోని 52 గ్రామాల రైతాంగానికి సాగునీరు పుష్కలంగా అందుతుంది. పనసభద్ర సమీపంలో ఉన్న డేకురాయి వద్ద చెక్ డ్యామ్ నిర్మిస్తే 1500 ఎకరాలు సాగయ్యే అవకాశాలున్నాయి. వలసబల్లేరు వద్ద చెక్‌డ్యామ్ కడితే వెయ్యి ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి. కొలిసవద్ద చెక్‌డ్యామ్ నిర్మిస్తే 750 ఎకరాల బీడు భూములు సాగులోకి వస్తాయి. కేదారిపురం గెడ్డ, దేరువాడ గెడ్డ, తాడికొండ గెడ్డ, డేకురు గెడ్డ తదితర గెడ్డలు, వాగులపై మినీ రిజర్వాయర్లు నిర్మిస్తే గిరిజన ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది.

ఉపాధి లేదు.. పంటలు పండవు

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఉపాధి లేదు. సాగు చేద్దామంటే నీరు లేక పంటలు పండటం లేదు. పండించే అటవీ ఫలసాయాలకు గిట్టుబాటు ధర లేదు. ప్రభుత్వాల సహకారం లేక కరువుతో బతుకు బరువై వలసలు పోతున్నారు.

- పాలక క్రాంతి కుమార్, సర్పంచ్, దుమ్మంగి

సాగునీటి వనరులు అభివృద్ధి చేయాలి

ఏజెన్సీ ప్రాంతంలో నిర్లక్ష్యానికి గురవుతున్న సాగునీటి వనరులపై ఐటిడిఎ అధికారులు దృష్టిసారించి అభివృద్ధి పరచాలి. ఏడాది పొడవునా పంట పొలాలకు సాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాలి. గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వలసలు నివారించాలి.

- కోలక అవినాష్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి

వేమన గొప్ప మానవతావాది

డిఆర్‌ఒ హేమలత

ప్రజాశక్తి-పార్వతీపురం

యోగి వేమన గొప్ప మానవతావాది అని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత అన్నారు. యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. వేమన చిత్రపటానికి డిఆర్‌ఒ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వమానవ సమానత్వం, అశ్పృస్యత ఖండన, నైతిక ప్రబోధం, మూఢనమ్మకాల ఖండన వంటి అంశాలను తన పద్యాలలో వేమన వెల్లడించారని తెలిపారు. కవిగా, యోగిగా ప్రజాదరణ పొందారని చెప్పారు. సరళమైన భాష, మధురమైన సందేశం కారణంగా ప్రజలు వేమన పద్యాలను ఆదరించారన్నారు. సిపి బ్రౌన్ వంటి వారు వేమన పద్యాలను ఆంగ్లంలోకి అనువదించారని, తద్వారా వాటి ప్రాశస్త్యాన్ని గుర్తించవచ్చని అన్నారు. వేమన కవిత్వ శైలి, పద్యాల్లోని అనేక పంక్తులు ఇప్పుడు తెలుగు భాష వ్యవహారిక పదబంధాలుగా విరాజిల్లుతున్నాయని తెలిపారు. సమాజంలోని రుగ్మతలను తూర్పార బట్టిన మనో వైజ్ఞానికుడు వేమన అని కొనియాడారు. కార్యక్రమంలో కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసి డాక్టర్ పి ధర్మచంద్ర రెడ్డి, జిల్లా కలెక్టర్ కార్యాలయ విభాగం పర్యవేక్షకులు శ్రీరామ్మూర్తి, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిఆర్‌ఒ హేమలత, అధికారులు

ఆస్పత్రిలో రోగి ఆత్మహత్య

ప్రజాశక్తి-పాలకొండ

మృతిచెందిన జోగునాయుడు

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వీరఘట్టం మండలం తలవరం గ్రామానికి చెందిన బివర జోగునాయుడు (45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం తెల్లవారు జామున ఆస్పత్రిలోని వార్డులో ఈ సంఘటన చోటు చేసుకుంది. దీంతో ఆస్పత్రిలో కలకలం రేగింది. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం మధ్యాహ్నం కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స కోసం జోగునాయుడు చేరాడు. కడుపు నొప్పి తీవ్రంగా ఉందని వైద్య సిబ్బందికి పదే పదే రోగి చెప్పాడు. ఆదివారం తెల్లవారుజామున వార్డులో మరుగుదొడ్డికి వెళ్లి ఎంతకీ తిరిగి రాకపోవడంతో భార్య కళ్యాణి వెళ్లి చూశారు. ఉరి వేసుకున్న ఉన్నట్లు గుర్తించడంతో ఆమె లబోదిబోమన్నారు. అసలు ఏం జరిగిందో తెలియని పరిస్థితి నెలకొంది. కడుపు నొప్పితో వచ్చిన వ్యక్తి ఆసుపత్రిలో ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడని చర్చనీయాంశమైంది. డ్యూటీ వైద్యులు సక్రమంగా వైద్యం అందించలేదా? అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, ఆ ఆరోపణలను వైద్యులు వ్యతిరేకిస్తున్నారు. వైద్య సేవలు మెరుగ్గా అందాయని, గతంలోనూ కడుపునొప్పుతో పలుమార్లు ఆస్పత్రిలో చికిత్స పొందాడని వైద్యులు చెప్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయొద్దని గ్రామస్తులు అడ్డుతగిలారు. పోస్టుమార్టం చేస్తే ఆస్పత్రి ముట్టడిస్తామంటూ హెచ్చరించారు. దీంతో సిఐ చంద్రమౌళి స్పందించి, వారికి సర్దిచెప్పారు.

ఎల్ఐసి రక్షణకు ఐక్యపోరాటం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఎల్ఐసి రక్షణ కోసం ఉద్యోగులు, ఏజెంట్లతో పాటు ఇతర ప్రజాసంఘాలతో కలిసి ఐక్యపోరాటం చేయనున్నట్లు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ పార్వతీపురం బేస్ యూనిట్ కార్యదర్శి టెక్కలి ధర్మారావు చెప్పారు. జీవిత బీమా సంస్థ జాతీయీకరణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్ఐసిని జాతీయీకరణ చేయడం ద్వారా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేశాన్ని ప్రగతిపథంలో నడిపించడంలో ఈ సంస్థ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ఇలాంటి ప్రభుత్వ రంగ సంస్థను ప్రయివేటీకరణ చేయాలని గత కొంతకాలంగా ఎన్‌డిఎ ప్రభుత్వం కుటిల యత్నాలు చేస్తోందని చెప్పారు. వందశాతం ఎఫ్‌డిఐలకు అనుమతి, ఐపిఒలో శాతం పెంపు వంటి నిర్ణయాలు సంస్థ మనుగడకు ముప్పుగా దాపురించాయన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటిస్తూ ఐక్య పోరాటానికి ఉద్యోగులు, ఏజెంట్లు సిద్ధం కావాలని ధర్మారావు పిలుపునిచ్చారు.

నేడు మున్సిపల్ కార్యాలయంలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సాలూరు రూరల్

సాలూరు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రీవెన్స్‌కు స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరవుతారని చెప్పారు. పట్టణ ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు.

రహదారిపై ప్రవహిస్తున్న మురుగనీరు

రహదారిపైకి మురుగునీరు

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని అక్కులపేట వీధికి రెండు వైపులా కాలువలు లేవు. దీంతో వాడుక నీరంతా రహదారిపైకి చేరుతోంది. దీనివల్ల రాకపోకలు సాగించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి సిసి రహదారి నిర్మించినా, రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించడం మరిచిపోయారు. మురుగునీటి వల్ల రహదారి నాచు పట్టడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని, వెంటనే కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

గదబవలస రహదారి ఇదే

అధ్వాన రహదారితో అవస్థలు

ప్రజాశక్తి-వీరఘట్టం

తమ గ్రామానికి బిటి రహదారి నిర్మించాలని పెదగదబవలస గ్రామ గిరిజనులు కోరుతున్నారు. కత్తులకవిటి రహదారి సర్వేతోట నుంచి గదబవలస మీదుగా హుస్సేన్‌పురం ఇటీవల కాలంలో రూ.కోటి 75 లక్షలతో బిటి రహదారి నిర్మించేందుకు అంచనాలు వేశారు. కానీ ఎందుకు పనులు ప్రారంభించలేదో అర్థం కావడం లేదని ఆ గ్రామస్తులు చెబుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా రహదారి అంతా చిత్తడిగా మారడంతో రాకపోకలు సాగించేందుకు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు వాపోతున్నారు. రహదారి అధ్వానంగా ఉండటం వల్ల గ్రామానికి 108, 104 వాహనాలు వచ్చే అవకాశాలు కరువయ్యాయని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బత్తిలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1988-89 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరూ తమ కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుని, రోజు మొత్తం ఆటలు, పాటలు పాడుతూ సందడి చేశారు. పాత జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

ఆకట్టుకున్న సైబర్ మోసాల లఘు చిత్రం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన కొంతమంది యువకులు సైబర్ మోసాలపై తీసిన లఘు చిత్రం ఎంతగానో ఆకట్టుకుందని సిఐ ఎన్‌వి ప్రభాకర్ అన్నారు. ఈ లఘు చిత్రాన్ని ఆదివారం పోలీస్ స్టేషన్‌లో సిఐ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసి డబ్బును కొల్లగొడుతున్నారన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపిలు చెప్పమన్నా, బ్యాంకు వివరాలు అడిగిన చెప్పవద్దని వివరించారు. లఘు చిత్రాన్ని నిర్మించిన యువకులు రాజు లక్కీ, శ్రావణ్ కుమార్, వెంకటేష్, ప్రసాద్, మహేష్, రాజులను సిఐ మెచ్చుకున్నారు. ఇలాంటి చిత్రాలతో సమాజంలో కొంత మార్పు వస్తుందని వారికి తెలిపారు. ఎస్ఐ సూర్య కుమారి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి- శృంగవరపు కోట

ఆర్‌టిసిలో ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు అవసరమని డిపో మేనేజర్ రమేష్ తెలిపారు. ఆర్‌టిసిలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక ఆర్‌టిసి డిపోలో సిబ్బందికి ఆయన ప్రమాదాల నివారణకు డ్రైవర్లు పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా డ్రైవర్లు డ్యూటీ లేని సమయంలో తగిన విశ్రాంతి తీసుకొని ఏకాగ్రతతో బస్సులు నడపాలన్నారు. మెకానిక్కులు బస్సును మంచి కండిషన్‌లో ఉంచాలన్నారు. ప్రతి రోజు డిపో సిబ్బందికి రహదారి భద్రత గురించి అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. అనంతరం భద్రత పై ప్రమాణం చేయించారు.

ప్రారంభమైన చుక్కమాంబ జాతర

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని అరిగిపాలెం గ్రామ దేవత చుక్కమాంబ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. యాత్రికులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మరుగున పడేశారా?

- వారం రోజుల్లో మరమ్మతులు చేయాలన్న మంత్రి
- 6 నెలలైనా రిపేర్లకు నోచుకోని మరుగుదొడ్లు
- మరో మూడు నెలల్లో శ్యామలాంబ పండగ

నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్లు

ప్రజాశక్తి-సాలూరు

పట్టణం లోని సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనుల కోసం మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. పట్టణంలో నిరుపయోగంగా ఉన్న 20 సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.20 లక్షల నిధులు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. అయితే ఆ నిధులు మున్సిపాలిటీలో లేకపోవడంతో పనులు చేయలేమని చేతులెత్తేశారు. మంత్రి సంధ్యారాణి ఒక అడుగు ముందుకేసి మున్సిపాలిటీలో నిధులు లేకపోతే జిల్లా కలెక్టర్‌ని అడిగి నిధులు తీసుకొస్తానని చెప్పారు. ఆ మాట కూడా అమలు కాలేదు. పట్టణంలోని సామాజిక మరుగుదొడ్లు నిరుపయోగంగా, దిష్టిబొమ్మల్లా మిగిలి ఉన్నాయి. చాలా మరుగుదొడ్లకు తలుపులు పూర్తిగా పాడయ్యాయి. రన్నింగ్ వాటర్ సౌకర్యం కూడా లేదు.

> 'మహిళల ఆత్మాభిమానం కాపాడాలని కొంతమంది మహిళలు ఎన్నికల ముందు ప్రచారానికి వెళ్లిన సందర్భంలో కోరారు. వారి ఆవేదన చూసి నేను ఎంతో కలత చెందాను. వారం రోజుల్లో పట్టణంలోని సామాజిక మరుగుదొడ్లు మరమ్మతు చేయాలి' అంటూ గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఆదేశించారు. మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత తొలిసారి మున్సిపల్ కార్యాలయానికి వచ్చి సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ మాటలు చెప్పి ఆరు నెలలు దాటిపోయింది. మంత్రి సంధ్యారాణి మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి.

సామాజిక మరుగుదొడ్లు ఎక్కువగా పట్టణంలోని మురికివాడల్లోనే ఉన్నాయి. అక్కడ నివశించే వారంతా రెక్కాడితే గాని డొక్కాడని బడుగు జీవులే. ఈ కుటుంబాలకు చెందిన మహిళలకు సామాజిక మరుగుదొడ్లే ఆధారం. వారి ఆత్మాభిమానాన్ని కాపాడుకునేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కానీ గత కొంతకాలంగా ఇవి వినియోగంలో లేకపోవడంతో మహిళల మరుగు సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. వారం రోజుల్లో మరమ్మతులు చేపట్టాలని మంత్రి సంధ్యారాణి ఆదేశించినా చేయలేని నిస్సహాయ స్థితిలో మున్సిపాలిటీ యంత్రాంగం ఉంది. పోనీ మున్సిపాలిటీలో నిధులు లేకపోయినా జిల్లా కలెక్టర్ నుంచి తీసుకొస్తానని కూడా మంత్రి సంధ్యారాణి మాటిచ్చారు. కొత్త జిల్లా కావడంతో కలెక్టర్ ఖజానాలోనూ నిధుల్లేని పరిస్థితి నెలకొంది.

మూడు నెలల్లో శ్యామలాంబ పండుగ

ఈ ఏడాది మే నెలలో శ్యామలాంబ గ్రామదేవత పండగ నిర్వహించనున్నారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత నిర్వహించనున్న ఈ పండగకు సుదూర ప్రాంతాల నుంచి లక్షలాది మంది రానున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పన మున్సిపాలిటీకి కత్తిమీద సాము లాంటిది. పట్టణంలోని మురికివాడల్లో నివశించే పేదల పరిస్థితి మరీ దయనీయంగా మారనుంది. సామాజిక మరుగుదొడ్లను ఎక్కువగా ఉపయోగించుకునే నిరుపేదలకు మరో ప్రత్యామ్నాయం లేదు. అనివార్యంగా మరుగుదొడ్లను మరమ్మతు చేయాల్సి ఉంది. అయితే ఆ దిశగా అడుగులు వేస్తున్న దాఖలాలు లేవు. అధికారులు మురుగుతున్న దొడ్లుగా ఎన్నాళ్లు ఉంచుతారో చూడాల్సిందే.

మల్టీపర్పస్ భవనాలు పూర్తిచేయాలి

ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి

మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ ద్వారా చేపడుతున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ భవనాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం సీతంపేట మండలంలోనిలాడ, జలుబుగూడ, పాండ్ర, బాపడుగూడ, గొయ్యి పాండ్ర గ్రామాల్లో చేపడుతున్న మల్టీపర్పస్ సెంటర్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. ఈ సందర్భంగా మండ గ్రామంలో సిసిడిపి పథకం ద్వారా తాగునీటి కోసం చేపడుతున్న ఓవర్ హెడ్ ట్యాంకు పనులను పరిశీలించారు. అనంతరం కుసిమి పిహెచ్‌సిని పరిశీలించారు. పిహెచ్‌సిలో బయో వ్యర్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఇలు సింధూజ, నాగభూషణ్, పిహెచ్‌సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలోని చినఊటగెడ్డకు చెందిన నడిమింటి తిరుపతిరావు సతీమణి వెంకటమ్మ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వచ్చిన రూ.2,50 లక్షల చెక్కును మంత్రి జి.సంధ్యారాణి తన క్యాంపు కార్యాలయంలో తిరుపతిరావుకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సిఎం సహాయనిధి ద్వారా చేయూత అందించడం ద్వారా వారు ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేశ్, యుగంధర్, తుండ మాజీ సర్పంచ్ ధర్మ, సత్తిబాబు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన కార్యాలయాలు

చెదలు పట్టిన కిటికీ

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

గుమ్మలక్ష్మీపురంలోని ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఎంపిడిఒ కార్యాలయ పైకప్పు స్లాబ్ లోపల భాగం పెచ్చులూడుతున్నాయి. కిటికీలకు చెదలు పట్టాయి. సమావేశ మందిరం లోపలి భాగం ప్లేవుడ్ పాడైంది. భవనం చుట్టూ మొక్కలు ఏపుగా పెరిగాయి. పశు వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కిటికీలకు చెదలు పట్టి పూర్తిగా పాడయ్యాయి. వర్షం పడితే చాలు నీరు చేరుతోంది. నూతన భవనం నిర్మించినా నేటికీ అప్పగించకపోవడంతో పాడైన భవనంలోనే విధులు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు వీటిపై దృష్టిసారించి మరమ్మతులు చేపట్టాలని, కొత్త భవనాలు వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

- ప్రజాశక్తి, గుమ్మలక్ష్మీపురం

ఎంపిటిసిపై దాడి కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-సాలూరు

ఈ నెల 16న ఎంపిటిసి సభ్యులు పాంచాలి ఉమామహేశ్వరరావుపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కి పంపించినట్లు రూరల్ సిఐ రామకృష్ణ చెప్పారు. ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడి చేసిన ఉణుకూరు జోసెఫ్, మోసూరు శివ అలియాస్ శివాజీలను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు చెప్పారు. దాడి సమయంలో వారు దోచుకున్న సెల్ ఫోన్లు, నగదు మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాచిపెంట ఎస్ఐ వెంకట సురేష్ ఉన్నారు.

రెల్లయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-సీతంపేట

ఇటీవల అడలి వ్యూ పాయింట్ వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సవర రెల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన జెఎసి నాయకులు బి.ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. రెల్లయ్యది నిరుపేద కుటుంబమని తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతుండటంతో సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపేస్తున్నట్లు ఇఇ ఎం.రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

అడలి వ్యూపాయింట్ వద్ద హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-సీతంపేట

అడలి వ్యూపాయింట్ వద్ద తరచుగా ప్రమాదాలు సంభవిస్తుండటంతో ఎస్ఐ వై.అమ్మన్నరావు స్పందించారు. ఆదివారం డేంజర్ జోన్ వద్ద నెమ్మదిగా వాహనాలు నడపాలని హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. మలుపుల వద్ద, ఘాట్ రోడ్డులో, డౌన్లో ప్రమాదపు సెంటర్‌లో ఎస్ఐ దగ్గర ఉండి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ఇప్పటికే ఆటో డ్రైవర్లకు యువతకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. అడలి వ్యూపాయింట్‌కు వెళ్తే హెల్మెట్ తప్పనిసరి అని బోర్డుల ద్వారా ప్రదర్శించారు.

సూరమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-సీతంపేట

సూరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు తల్లి ఆరిక సూరమ్మకు స్వగ్రామైన వలగెడ్డలో యుటిఎఫ్ నాయకులు ఆదివారం ఘన నివాళి అర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నదొర నివాళు లర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, ట్రెజరర్ కె.మురళి, పూర్వ నాయకులు గొంటి గిరిధర్, బొడ్డేపల్లి మోహన్‌రావు, రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశ్, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, ఎం.పైడిరాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.ఆనందరావు, బి.పకీరు, జిల్లా కౌన్సిలర్ పి.కృష్ణారావు, నాయకులు సింహాచలం, పి.నారాయడు సంతాపం తెలిపారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

పార్వతీపురంరూరల్.. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవిఐ వరప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రహదారి ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్ వాడకంపై కలిగే లాభాలను వివరిస్తూ రవాణా శాఖ అధికారులు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎంవిఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో పార్వతీపురం రాయగడ రోడ్, వెంకంపేట వై-జంక్షన్‌తోపాటు పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులను ఆపి వారికి హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగించని వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయకుండా, హెల్మెట్లను కొనిపించారు. రహదారి నిబంధనలను వివరిస్తూ అతివేగం వల్ల కలిగే అనర్థాలను ప్రయాణికులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ : హెల్మెట్, లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.వరప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని శివిని అంతర్రాష్ట్ర రహదారిపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైనా కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుపడితే వారి వాహనాలను సీజ్ చేసి లైసెన్సులను రద్దు చేస్తామని తెలిపారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు ఉండేలా చూసుకోవాలని, లేకపోతే అపరాధ రుసుం భారీగా విధిస్తామని తెలిపారు. అనంతరం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి హెల్మెట్లు లేకపోవడంతో తక్షణమే వారితో హెల్మెట్లు కొనుగోలు చేసి, ధరించే విధంగా అవగాహన కల్పించారు.

సీతానగరం : ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. ఆదివారం జంక్షన్‌లో వాహనదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలో ప్రయాణికులను పరిమితి మించి ఎక్కిస్తే చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ.. వాహనదారుడికి హెల్మెట్ అందిస్తున్న ఎంవిఐ